



విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని కలెక్టరేట్‌కు వచ్చిన తల్లిదండ్రులు

పేకాడుతూ దొరికేశారు!

» కాకినాడలో పేకాడుతూ పట్టుబడిన వైసీపీ మాజీ కార్పొరేటర్
» మరికొందరు ప్రముఖుల బంధువులు
» రూ.19,500 నగదు స్వాధీనం చేసుకున్న టూటౌన్ పోలీసులు

కాకినాడ క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో పేకాడుతూ పలువురు ప్రముఖులు కాకినాడ టూటౌన్ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసిన పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ భాస్కర్‌నగర్ వాటర్‌ట్యాంక్ షిర్డీసాయిబాబా గుడి సమీపంలోని ఓ ఇంటిలో కొందరు పేకాడుతున్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు సోమవారం రాత్రి 8.30గంటల సమయంలో కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారిలో కాకినాడ వెంకట్‌నగర్‌కు చెందిన వైసీపీ మాజీ కార్పొరేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరుడు కంపర బాబి, శాంతినగర్‌కు చెందిన ముమ్మిడి సత్యనారాయణమూర్తి, వెన్నెగూడేనికి చెందిన నరాలశెట్టి లక్ష్మీపతిరావు, వాకలపూడి మహాలక్ష్మినగర్‌కు చెందిన కొసిరెడ్డి అప్పలరాజు, ఆదిత్య కళాశాల సమీపంలోని శ్రీరంగ వారి స్ట్రీట్‌లో నివసించే మెండు గంగాధర్ రమేష్ ఉన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వారి నుంచి రూ.19,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మజ్జి అప్పలనాయుడు తెలిపారు. రాత్రి 8.30 గంటల సమయంలో పట్టుబడితే రెండు గంటల వ్యవధిలోనే ఈ ఐదుగురూ బయటకు వచ్చేయడం విశేషం.

మారని తీరు..

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా పేకాట క్లబ్బులు నడిపిన కొందరు ద్వారంపూడి అనుచరులు కూటమి ప్రభుత్వంలోనూ అదే పంథా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో రామారావుపేటలో ద్వారంపూడి సమీప బంధువు ఇంట్లో పేకాట ఆడుతూ పలువురు పట్టుబడ్డారు. పోలీసులు పెద్దఎత్తున నగదు స్వాధీనం చేసుకున్నారు. ఒకపక్క పోలీసులకు పట్టుబడుతున్నా.. వారి అసాంఘిక కార్యకలాపాలకు మాత్రం అడ్డుకట్ట పడడంలేదు.

రూ.788 కోట్లు.. ఏమయ్యాయి!

డీసీసీబీలో దారుణాలు



» మొండిబాకీల బెంగ
» 23 భారీ కుంభకోణాలు
» రూ.600 కోట్ల బకాయిలు
» రుణ డాక్యుమెంట్లు బోగస్
» అక్రమాలకు సహకారం
» గాలికొదిలేస్తోన్న అధికారులు
» అప్పులు రూ.4250 కోట్లు
» వార్షిక వడ్డీ రూ.250 కోట్లు
» సొసైటీల కంప్యూటరీకరణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రానురాను తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. బోగస్ రుణాలు.. ఆర్థిక అవకతవకలు డీసీసీబీకి తలనొప్పిగా మారాయి. బ్యాంకును ఆర్థికంగా పటిష్ఠంగా ఉంచడంలో కీలకపాత్ర వహించాల్సిన సొసైటీలు అనేక అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. బ్యాంకు సొమ్ములను దిగమింగే అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నాయి. దీంతో డీసీసీబీ సొమ్ము చాలా వరకు దొంగల పాలవుతోంది.అప్పుల రూపంలో ఇచ్చిన సొమ్ము వెనక్కు తిరిగి రావడం కలగానే మారుతోంది. ఇప్పటి వరకూ రూ.788 కోట్లు వస్తాయో రావో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ మొత్తంలో 23 కుంభకోణాలకు సంబంధించిన రూ.188 కోట్ల అవినీతి జరగ్గా.. వీటికి అనుసంధానంగా రూ.600కోట్ల రుణాలు వసూలు కాకుంగా గుదిబండలా మారాయి. ఇందులో వసూలు చేద్దామన్నా అసలు తీసుకున్న రుణ గ్రహీతలెవరో తెలియనంతగా దొంగ రుణాలు జారీచేసేశారు. ఈ తరహా అక్రమాలకు చెక్ పెట్టడం కోసం తాజాగా డీసీసీబీ పరిధిలోని అన్ని సొసైటీల రికార్డులను రూ.5.21కోట్లతో డిజిటల్ విధానంలో ఆధునికీకరించారు.

ఉమ్మడి జిల్లాలో 298 సొసైటీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కాకినాడలో డీసీసీబీ ఉంది. దీని కింద కాకినాడ జిల్లాలో 72 సొసైటీలు, తూర్పుగోదావరి జిల్లాలో 49, కోనసీమ జిల్లాలో 166, అల్లూరి జిల్లాలో 11 కలిపి మొత్తం 298 సొసైటీలు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు కావాల్సిన రకరకాల పంట రుణాలందిస్తారు. ఇప్పటి వరకు కేవలం కాగితాల ఆధారంగానే సొసైటీ రుణాలు జారీ చేసేవారు. ఈ క్రమంలో అనేక కుంభకోణాలు చోటుచేసుకున్నాయి. అనేక జిల్లాల్లో డీసీ సీబీల ఎన్‌పీఏలు రూ.150 కోట్ల వరకే ఉంటే ఉమ్మడి జిల్లా డీసీసీబీకి మాత్రం రూ.788 కోట్ల వరకు ఉండడంతో ఏ స్థాయిలో డీసీసీబీని అక్ర మార్కులు పిండేశారో అర్థం చేసుకోవచ్చు. ఈ మొండిబాకీలు ఎప్పటికీ రావనే ఆలోచనతో అధికారులు ఆశలు వదిలేసుకున్నారు.

23 కుంభకోణాలు..

డీసీసీబీ ద్వారా జారీ చేసే రుణాల్లో అసలు రైతులకు ప్రయోజనం చేకూరేది పిసరంత.. కొందరు నేతలు, అక్రమార్కులకు డీసీసీబీ బంగారుబాతులా మారింది. తమ పలుకుబడి, అధికారాలతో అనేక మంది నేతలు డీసీసీబీ రుణాలను బోగస్ వ్యక్తులకు ఇప్పించి వాటిని స్వాహా చేసేశారు. ఇప్పటివరకు 23రకాల కుంభకోణాలు జరగ్గా అందులో కాకినాడ జిల్లాలోని కిర్లంపూడి, ఏలేశ్వరం సహకార సొసైటీల పరిధిలోని స్కాంలే రూ.150 కోట్ల వరకు ఉన్నాయి. కిర్లంపూడి సొసైటీలో అవినీతే రూ.104 కోట్లు. సొసైటీ అధికారులు కొందరు అక్రమార్కులతో కుమ్మక్కై రుణాలు జారీ చేసి డబ్బునొక్కేశారు. అటు ఏలేశ్వరం సొసైటీకి సంబంధించి రూ.46 కోట్ల అవినీతి జరిగింది. జగ్గంపేట, గండేపల్లి సొసైటీల్లోను ఇదే తీరు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం డి.రావులపాలెం, మలికిపురం మండలం లక్కవరం, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, సీతానగరం మండలం వెదుళ్లపల్లి, తాళ్లపూడి మండలం రాగోలపల్లి తదితర సొసైటీల్లోను అవకతవకలు జరిగాయి. ఈ అవినీతి కారణంగా రూ.600 కోట్లు నిరర్థక ఆస్తులుగా మారినట్టు అధికారులు ఇటీవల గుర్తించారు. కుంభకోణాలకు తోడు ఆయా ప్రాంతాల్లో రైతుల పేరుతో జారీ చేసిన రుణాలు బోగస్‌గా ఉన్నట్టు గుర్తించారు. రికార్డుల్లో ఉన్న పేర్ల ఆధారంగా రికవరీకి ప్రయత్నిస్తుంటే అసలు ఆ పేరుతో ఉన్న రైతులే లేరు. దీంతో ఇప్పుడు ఏంచేయాలో అధికారులకు అర్థం కావడం లేదు. మొత్తం రూ.788కోట్లు నిరర్థకంగా మారడంతో అసలు అవి వస్తాయన్న నమ్మకం కూడా డీసీసీబీ అధికారులకు సడలిపోయింది. రూ.188 కోట్ల అవినీతికి సంబంధించి డబ్బులు మెక్కేసిన వారిని గుర్తించి ఆస్తుల రికవరీకి ప్రయత్నిస్తుంటే చాలామంది న్యాయస్థానాలను ఆశ్రయించి స్టేలు తేవడంతో అధికారులు మొండిబాకీల జోలికి వెళ్లడంలేదు.దీంతో డీసీసీబీ ప్రస్తుతం పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది.

అప్పుల కుప్ప...

రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో వ్యసాయ రుణాలు అధికంగా ఇవ్వడంలో ఒకప్పుడు డీసీసీబీకి పేరు.కానీ ఇప్పుడు బోగస్ రుణాలు, మొండిబాకీలతో అష్టకష్టాలు పడుతోంది. ఇచ్చిన రుణాల వసూళ్లలో అలసత్వంతో బ్యాంకు మనుగడే కష్టంగా మారింది. ఇటీవల గుర్తించిన లెక్కల ప్రకారం డీసీసీబీకి మొత్తం అప్పులు రూ.4250 కోట్లుగా తేలాయి. వీటికి సంబంధించి ఏటా వడ్డీని డీసీసీబీ రూ.250కోట్లు చెల్లిస్తుందంటే పరిస్థితి ఏ విధంగా దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఇకనైనా ఒడ్డున పడేనా..

ఉమ్మడి జిల్లా డీసీసీబీ పరిధిలో 298 సొసైటీలు ఉన్నాయి. ఇప్పటికీ పాతపద్ధతిలోనే పుస్తకాలపై లావాదేవీలు సాగుతున్నాయి. దీంతో బోగస్ రుణాల జారీ,నిధుల దుర్వినియోగం భారీగా ఉంటోంది. తద్వారా అనేక అక్రమాలకు తావిస్తోంది.ఈ నేపథ్యంలో సొసైటీల రికార్డులను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేశారు. ఒక్కో సొసైటీకి రూ.1.75 లక్షల చొప్పున రూ.5.21 కోట్లతో ఆధునీకరించారు.ప్రతి లావా దేవీ కంప్యూటరీకరణ జరిగేలా చేశారు. దీంతో అక్రమాలకు ఏ మేరకు అడ్డుకట్టపడుతుందో చూడాలి.

పరిష్కార 'అవస్థ'

» పీజీఆర్ఎస్‌కు భారీగా వినతులు
» వందల సంఖ్యలో అర్జీల రాక
» వచ్చిన వారే మళ్లీ మళ్లీ ఫిర్యాదులు
» చాలా సమస్యలు పరిష్కారం కాని వైనం
» పరిష్కారమైనట్టుగా అర్జీదారుల మొబైల్‌కు మెసేజ్‌లు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)



తమ ఇల్లు కూల్చివేశారంటూ కలెక్టరేట్‌కు వచ్చిన పిఠాపురం ఇందిరానగర్ కాలనీవాసులు

మా ఇల్లు కూల్చేశారు..

ఈ చిత్రంలో కనిపిస్తున్న వీరు పిఠాపురంలోని 9వ వార్డు ఇందిరానగర్ కాలనీవాసులు. వీరికి 2011లో అప్పటి తహసీల్దార్ నివేశన స్థల ధ్రువీకరణ పత్రమిస్తూ స్థలం కేటాయించారని, ఆ స్థలంలో ఇల్లు కట్టుకుని నివసిస్తున్న తమను మున్సిపల్ అధికారులు అర్థాంతరంగా రోడ్డున పడేశారని మిరియాల సూర్యకుమారి కాకినాడ కలెక్టరేట్లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ అందజేసింది. స్థానికంగా పాడా కార్యాలయంలోను, మున్సిపల్ కమిషనర్ వద్దకూ పలుమార్లు తిరిగింది. అయినా సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం ఇంటిల్లిపాదీ కలెక్టరేట్‌కు వచ్చారు. వీరే కాదు.. ఇలాంటి వారెందరో తమ సమస్యల పరిష్కారం కోసం వారం వారం కలెక్టరేట్లో జరిగే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి పెద్ద ఎత్తున జనం విచ్చేస్తున్నారు. తమ సమస్యల అర్జీలతో కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకుంటున్నారు.

ఆ హామీ నెరవేరుతోందా?

'తమ సమస్య జిల్లా కలెక్టరేట్‌లో చెప్పుకొంటేనే పరిష్కారమవుతుంది. ఆయన చెబితేనే కింది స్థాయిలో సమస్యను అధికారులు పరిష్కరిస్తారు. మండల, గ్రామస్థాయి అధికారులు స్పందిస్తారు' అనే గట్టి నమ్మకంతో ఎక్కడెక్కడినుంచో జిల్లా కేంద్రానికి అర్జీదారులు వందల సంఖ్యలో విచ్చేస్తున్నారు. తమ సమస్యల గోడును ఉన్నతాధికారుల వద్ద వెళ్లబోసుకుంటున్నారు. మరోవైపు అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు కూడా సమస్యలకు పరిష్కారం తప్పకుండా చూపుతామని భరోసా కల్పిస్తుండడంతో అర్జీదారులు ఆశతో వెనుదిరుగుతున్నారు. వాస్తవానికి చాలా సమస్యలు పరిష్కారం కావడం లేదు. స్థానికంగా అధికారులు పట్టించుకోకపోవడంతో పదేపదే కలెక్టరేట్‌కు వస్తూ చెట్లకింద, గట్లపైన పడిగాపులు పడుతున్నారు.

ప్రైవేటు స్కూళ్లల్లో సీట్ల కేటాయింపుపై..

ఈ చిత్రంలో ఉన్న వీరందరూ.. విద్యార్థుల తల్లిదండ్రులు.. విద్యాహక్కు చట్టం ద్వారా తమ పిల్లలకు ప్రైవేటు స్కూళ్లల్లో సీట్లు కేటాయించినా.. స్కూలు యాజమాన్యాలు తమను పట్టించుకోవడం లేదని, కనీసం గేటు తీసి లోనికి కూడా రానివ్వడం లేదని వాపోతున్నారు. ఇదే సమస్యను కొన్నివారాలుగా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు విన్నవిస్తూనే ఉన్నామని, అయినా పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

ఎక్కువ భూ సర్వేలపైనే..

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కలెక్టరేట్‌కు ఎక్కువ భూ రీసర్వే, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, కోరుతూ వస్తున్న అర్జీలే అధికం. గత ప్రభుత్వంలో తప్పిదాలతో భూ యజమానులు ముప్పుతిప్పలు పడుతున్నారు. జగనన్న కాలనీల సమస్యలు, టిడ్కో ఇళ్ల కేటాయింపు, రేషన్‌కార్డుల సమస్యలు, సదరమ్ సర్టిఫికెట్లు, పింఛను ఇప్పించాలని.. అనేక సమస్యలు అధికంగా వస్తున్నాయి.

వచ్చిన అర్జీలను ఏం చేస్తున్నారంటే..

ఆయాశాఖల్లో నమోదైన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారానికి దరఖాస్తులను ఆడిటింగ్ చేయిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపాక తర్వాత వాటిని రాష్ట్రస్థాయికి పంపుతున్నారు. ఒకే విషయమై వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు అధికారులు చెప్తున్నా.. అది అమలు కావడం లేదనిపిస్తోంది.

లోపాలివేనా?

పీజీఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించడంలో రెండు రకాల లోపాలను అధికారులు గుర్తించారు. ఒకటి ప్రొసీజర్ లోపం అంటే లబ్ధిదారులు దరఖాస్తు చేసిన దగ్గర నుంచి లబ్ధిదారుడికి సమాచారం చేరవేయడం.. సమస్య గురించి సమీక్షించడం వంటివి. రెండోది దరఖాస్తుదారులతో మాట్లాడే విధానం బిహేవియర్ లాప్సిస్‌గా గుర్తించారు.

మూడునెలలుగా కలెక్టరేట్‌లో అర్జీల సంఖ్య..

ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు 300నుంచి 600కి పైగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈ సోమవారం జూలై ఏడో తేదీ నాటికి జిల్లాలో పీజీఆర్ఎస్‌కు 33,024 దరఖాస్తులురాగా, అందులో 31,253 దరఖాస్తులు పరిష్కరించినట్టు వెల్లడించారు. అందులో 1771 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు.

తేదీ		దరఖాస్తులు
ఏప్రిల్ 7	-	478
ఏప్రిల్ 21	-	503
ఏప్రిల్ 28	-	439
మే 5	-	351
మే 12	-	373
మే 19	-	418
మే 26	-	432
జూన్ 2	-	408
జూన్ 16	-	681
జూన్ 23	-	335
జూన్ 30	-	556
జూలై 7	-	623

10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్..

విద్యా ఉత్సవంలా నిర్వహించాలి

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో, సాంకేతిక విద్యాసంస్థల్లో ఈనెల 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0 విద్యా ఉత్సవంలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్లో సోమవారం నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మండల అధికారులు, విద్యాశాఖ అధికారులతో దీనిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యారంగంలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పేందుకు పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలన్నారు. జిల్లాలో 1260 ప్రభుత్వ, 596 ప్రైవేటు, 20 ఎయిడెడ్ పాఠశాల్లో, 141 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల్లో నిర్వహిస్తుందన్నారు. ఈ మెగా పీటీఎం కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. దీనికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, పేరెంట్-టీచర్ అసోసియేషన్లు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో చేయాలన్నారు. అంశాల వారీగా అనుసరించాల్సిన ప్రత్యేక చెక్‌లిస్ట్‌ను సూచించారు. ప్రత్యేక అధికారులు ప్రజాప్రతినిధులను, స్థానిక ప్రముఖులను ఆహ్వానించి కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమానికి ఆహ్వానం, బడ్జెట్ కొనుగోళ్లు, పాఠశాల పరిశుభ్రత, సుందరీకరణ, పర్యావరణ భద్రత, రిసెప్షన్, సిట్టింగ్ ఏర్పాట్లు, ప్రగతి నివేదిక తయారీ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆహారం, తాగునీరు, క్రమశిక్షణ, పార్కింగ్, వైద్యసాయం, గ్రీన్‌పాస్‌పోర్టు, డాక్యుమెంటేషన్, ఫొటో, వీడియో, తల్లికి వందనం, మీడియా కవరేజీల కోసం కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల హెల్త్ కార్డులను తల్లిదండ్రులను చూపి వారి పోషణ ఆరోగ్యరక్షణ గురించి చర్చించాలన్నారు. అమ్మ పేరుతో మొక్క నాటి పోర్టల్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసి విద్యార్థులకు గ్రీన్‌పాస్‌పోర్టు జారీ చేయాలన్నారు. మెగా పీటీఎం 2.0 కార్యక్రమాలకు హాజరయ్యే తల్లుల కోసం ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, టగ్‌ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, డీఈవో రమేష్, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు గృహనిర్మాణశాఖ మంత్రి తుని రాక

కలెక్టరేట్(కాకినాడ), జూలై7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణశాఖ, ఐఅండ్ పీఆర్ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి ఈనెల 8న జిల్లాకు విచ్చేస్తున్నారు. ఆయన మంగళవారం ఉదయం 7గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి ఉదయం 9గంటలకు తుని పట్టణం చేసుకుంటారు. తొలుత టీడీపీ శ్రేణులతో సమావేశమవుతారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, కూటమి పార్టీ నేతలతో కలిసి పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు తునినుంచి ఆయన బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ చేరుకుంటారు.

భవిష్యత్ తరాలకు ఆదర్శం.. డొక్కా సీతమ్మ 6
విద్యార్థులకోసం సొంత డబ్బులతో బ్రిడ్జి నిర్మించిన ఉపాధ్యాయుడు 6

నాణ్యతకు తూట్లు



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య పిడిందొడ్డి సమీపంలో కాలువ గట్లుపై చెట్లు తొలగించి పైపైన చేసిన పనులు

గొల్లప్రోలు ఏలేరు కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం/గొల్లప్రోలు)

» క్లోజర్ పనుల్లో ఇష్టారాజ్యం
» అసంపూర్తిగానే పలు పనులు
» పొలాల్లో మట్టి తవ్వి గండ్లు పూడ్చివేత
» సగానికి పైగా పనులు మధ్యలోనే..
» పీబీసీ, ఏలేరు కాలువలకు నీరు

ఏళ్లతరబడి జరగని కాలువల పనులు ఇప్పుడు జరుగుతున్నా నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. కాలువలకు నీరు విడుదలైన తర్వాత కూడా సగానికిపైగా పనులు సాగుతుండగా పలుచోట్ల ఇంకా ప్రారంభం కాలేదు. ఇరిగేషన్ అధికారులు తూతూమంత్రం పనులకు బిల్లులు చేసేద్దామనుకుంటున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

క్లోజర్ పనులపై దృష్టి

వైసీపీ పాలనలో పంట కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వరదలు, వర్షాలకు కాలువలు, కళింగల్స్, స్లూయిజ్‌లు దెబ్బతిన్నా, కాలువల్లో పూడికలు పేరుకుపోయినా క్లోజర్ పనులు చేపట్టలేదు. అప్పట్లో వచ్చిన వరదలకు తాత్కాలికంగా గండ్లు పూడ్చడం మినహా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్లోజర్ పనులపై దృష్టిసారించింది. ఇరిగేషన్ అధికారులు భారీగా ప్రతిపాదనలు పంపినా నిధుల లభ్యత ఆధారంగా ఈ పనులను కుదించారు. ఏలేరు, పీబీసీ కాలువలతోపాటు పంపా ఆయకట్టు కాలువలు, ఇతరత్రా మేజర్, మైనర్ ఇరిగేషన్ పనులు నిమిత్తం జిల్లాలో రూ.11.36కోట్ల వ్యయంతో 299 పనులకు ప్రభుత్వం అనుమతులుఇచ్చింది. ఇందులో అత్యధికంగా పిఠాపురం నియోజకవర్గ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్ పరిధిలోకి వచ్చే ఏలేరు, పీబీసీ కాలువల్లో పూడికతీత, గండ్లు పూడ్చివేత, ఇతర ఆపరేషన్ అండ్ మెయింట్‌నెన్స్‌కు సంబంధించి 126 పనులకుగాను రూ.4.48కోట్లు మంజూరుచేసింది. కాకినాడ రూరల్‌లో పది పనులకు రూ.49 లక్షలు, ప్రత్తిపాడులో 45పనులకు రూ.1.52కోట్లు, జగ్గంపేట పరిధిలో 32పనులకు రూ.1.98 కోట్లు,పెద్దాపురంలో 31పనులకు రూ.1.51కోట్లు, తునిలో 55పనులకు 1.37కోట్లు కేటాయించారు.

జూన్‌లోనే పూర్తి కావాల్సి ఉండగా..

క్లోజర్ పనులను కాలువలు మూసివేసిన వెంటనే ప్రారంభించి తిరిగి నీరు విడుదల సమయానికి పూర్తి చేయాలి. పీబీసీ కాలువకు గోదావరి జలాలను జూన్ మొదటి వారంలోనే విడుదల చేశారు. ఆ సమయానికి పనులు పూర్తిచేయాల్సిఉండగా ఇంకా సాగుతూనేఉన్నాయి. చిత్రాడ, గొల్లప్రోలు, మల్లవరంల్లోని కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక అలాగే ఉంది.

ఏలేరులో పనుల నిర్వహణ ఇలాగేనా..

ఏలేరుపరిధిలో పనులు సక్రమంగాసాగడం లేదనే విమర్శలున్నాయి. పలుచోట్ల గట్లపైఉన్న చెట్లు, తుప్పలు తొలగించి కాలువలో ఉన్న పూడికను స్వల్పంగా తొలగించి అదే గట్లుపై వేసి పనులు పూర్తి చేసినట్లు చెబుతున్నారని రైతులు తెలిపారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య టోల్‌గేట్ సమీపంలోని పిడిందొడ్డివద్ద పనులు ఇదే రీతిలో ఉన్నాయి. పిఠాపురం మండలం రాపర్తి సమీపంలో గొర్రిఖండి కాలువపై గండ్లు పూడ్చివేత, ఇతర పనుల నిర్వహణకుగాను రూ.30.32లక్షలు మంజూరు చేశారు. గతేడాది ఏలేరు వరదలకు ఇక్కడ భారీనష్టం జరిగింది. ఇటువంటి చోట్ల పటిష్టంగా పనులు నిర్వహించాల్సి ఉండగా జరిగిన తీరు మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని రైతులు చెప్తున్నారు.

గుర్రపుడెక్క ఎప్పుడు తొలగిస్తారు

ఏలేరు, పీబీసీ కాలువలపరిధిలో గుర్రపుడెక్క ఉండిపోయింది. దీన్ని ముందుగానే తొలగిస్తే సాగునీటి సరఫరాకు ఆటంకాలు ఉండవు. ఓవైపు వర్షాలు, మరోవైపు కాలువలకు నీరు విడుదల నేపథ్యంలో గుర్రపుడెక్క కొట్టుకుపోతుందని, అప్పుడు పనులు చేసినట్లు చూపించవచ్చునని భావిస్తున్నట్లు సమాచారం. ఉపాధి హామీలో చేసిన కొన్ని పనుల ను క్లోజర్ పనుల్లోనూ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. సాగునీటి సంఘాలప్రతినిధులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు పనులు సక్రమంగా జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 627 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూలై7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు నాణ్యతతో కూడిన పరిష్కారం అందివ్వాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందివ్వాలన్నారు. వివిధఅంశాలపై 627 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ మనీష, డీఆర్వో వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 64 అర్జీలు

కాకినాడ క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 64మంది అర్జీదారులు సోమవారం అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా అడ్మిన్ ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో వీసీ నిర్వహించి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.





విద్యార్థులు ఆ పాఠశాలకు నిత్యం కాలువలో నీటిని దాటుకుని వెళ్లాల్సిందే. నీరు ఎక్కువగా ఉంటే కళింగల్‌పై తాటిబద్దలు వేసుకుని దాటే పరిస్థితి. ప్రమాదకరమైన పరిస్థితుల్లో విద్యార్థులను పాఠశాలకు పంపేది లేదంటూ తల్లిదండ్రులు తేల్చిచెప్పడంతో ఒకప్పుడు వందకు పైగా ఉన్న విద్యార్థుల సంఖ్య రెండుకు పడిపోయింది. ఆ సమయంలో ఆ పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజు చొరవ తీసుకుని తన సొంత సొమ్ము లక్ష రూపాయలు వెచ్చించి బ్రిడ్జి నిర్మింపజేశారు. దీంతో ఇప్పుడు ఆ పాఠశాలకు వెళ్లేందుకు ప్రమాదం లేని శాశ్వత దారి ఏర్పడింది.



విద్యా వారధి

- విద్యార్థుల కోసం ఏకంగా బ్రిడ్జి నిర్మించారు
- సొంత నిధులు వెచ్చించిన ఉపాధ్యాయుడు సీతారామరాజు
- గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేట ప్రాథమిక పాఠశాలకు మార్గం సుగమం

గొల్లప్రోలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కాలువ అవతల నిర్మించారు. సూరంపేట ప్రాంత వాసులు, ఇతర ప్రాంతాల పిల్లలు, ఉపాధ్యాయులు అక్కడకు కాలువ దాటుకుని వెళ్లాలి. వర్షాకాలం, కాలువలో నీరు ఉన్న సమయంలో మెరకచేను కళింగల్‌పై తాటిబద్దలు ఏర్పాటు చేసుకుని వెళ్తున్నారు. గతంలో నీరు ఎక్కువగా ఉన్న సమయంలో ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు, వలంటీరు స్కూలుకి వెళ్లేందుకు కాలువ దాటే ప్రయత్నం చేయగా ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. అప్పటి వరకు వందకు పైగా ఉన్న విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. వరదలు, కాలువలో నీరు ఎక్కువగా ఉన్న సమయంలో తరగతులను సూరంపేటలోని రామాలయంలో నిర్వహిస్తూ వచ్చారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో తమ పిల్లలను చదివించలేమంటూ తల్లిదండ్రులు ఇతర పాఠశాలల్లో చేర్పించారు. దీంతో విద్యార్థుల సంఖ్య రెండుకు పడిపోయింది. ఈ సమయంలో సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజు బదిలీపై వచ్చారు. పాఠశాల పరిస్థితులను గమనించారు. తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు ముందుగా దారి మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. రూ.లక్ష సొంత ఖర్చుతో పాఠశాలకు వెళ్లేందుకు వీలుగా మెరక చేను కళింగల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి పూనుకున్నారు. కళింగల్ కానులను ఎత్తు చేసి బ్రిడ్జి నిర్మించగా రక్షణ గోడల నిర్మాణం చేపట్టారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు సురక్షితంగా వెళ్లేందుకు మార్గం ఏర్పడింది. ముగ్గురు విద్యార్థులు చేరడంతో విద్యార్థుల సంఖ్య ఐదుకు చేరగా మరో ముగ్గురు చేరేందుకు సిద్ధమయ్యారు. తాను పనిచేసే పాఠశాలకు మార్గం కోసం ఏకంగా బ్రిడ్జినే నిర్మించిన సీతారామరాజును పలువురు అభినందించారు.



సూపర్ సార్ మీరు...

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే మార్గదర్శి అయిన మీరు వారు పాఠశాలకు వెళ్లేందుకూ మార్గం చూపించారు. సూపర్ సార్ మీరు. సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో సొంత నిధులు లక్ష రూపాయలు వెచ్చించి కాలిబాట వంతెన ఏర్పాటు చేయించిన మీకు నా ప్రత్యేక అభినందనలు.

ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్



ప్రతి ఒక్కరికీ చదువుతో పాటు సంస్కారం ఉండాలి... చదువు ఉత్తములుగా తయారు చేస్తే.. సంస్కారం ఉన్నతులుగా తీర్చిదిద్దుతుంది... విద్య లేని వాడు వింత పశువు ఎలాగో నేటి సమాజంలో విలువలు లేని వాడు కూడా అంతే.. విలువల్లేని విద్య వ్యర్థమే. పిల్లలకు నైతిక విలువల గురించి చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నాగరికతతో ఎలా నడుచుకోవాలి... స్నేహపూర్వకంగా ఎలా మసలుకోవాలి... పెద్దల పట్ల ఎలా వినయ, విధేయతలు చూపాలి... గురువులను ఎలా గౌరవించాలి... ఓర్పు, సహనంతో ఎలా విజయాలు సాధించాలి... ఎదుటివారికి ఎలా సాయపడాలి?, చెడు అలవాట్లకు ఎలా దూరంగా ఉండాలి..., ఏం మాట్లాడాలి/ఏమేమి మాట్లాడకూడదు... ఇలా అనేక విషయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు పాఠశాలల్లో అందించడంపై విషయమై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. నేటి సమాజంలో తగ్గిపోతున్న విలువలను విద్యార్థులకు తెలియజేసేందుకు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. త్వరలోనే విలువల విద్యకు సంబంధించిన పుస్తకాలు అందజేయనుంది.

'విలువల' విద్య



- పాఠశాల విద్యార్థులకు అందించేందుకు కూటమి సర్కారు చర్యలు
- విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రూపకల్పన
- 39 పేజీల పుస్తకంలో అనేక విశేషాలు... త్వరలో పంపిణీకి ఏర్పాట్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో 6-10 తరగతులు చదివే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి 'విలువల విద్య' పుస్తకాలను అందించనున్నారు. విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఈ పుస్తకాలను రూపొందించింది. ఆరో తరగతికి 'తోరణాలు', ఏడో తరగతికి 'మనోవికాసం', ఎనిమిది, తొమ్మిది తరగతులకు 'సూక్తి సుధ', పదో తరగతికి 'అమృతధార' పేరుతో ఈ పుస్తకాలను తీసుకొచ్చారు. ఇవి ఒక్కొక్కటి దాదాపు 39 పేజీల వరకు ఉన్నాయి. పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ పెట్టారు. ఆయా పాఠ్యాంశాల వీడియోలు కావాలనుకున్న వారు వాటిని స్కాన్ చేయాలి. సుప్రసిద్ధ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు, ప్రసిద్ధ చిత్రకారుడు బాపు గురించి క్లుప్తంగా ఇచ్చారని సమాచారం. ప్రస్తుతం ఈ పుస్తకాల ముద్రణ చివరి దశకు చేరింది. త్వరలో ఈ పుస్తకాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా విడుదల చేయనున్నట్టు విద్యాశాఖాధికారులు చెప్తున్నారు. వారం, పది రోజుల్లో ఈ పుస్తకాలు విద్యా శాఖ కార్యాలయానికి చేరనున్నట్టు వారు వివరించారు.

ఏ తరగతిలో ఏం ఉంటాయి...

- పదో తరగతిలో విద్య విలువ, సజ్జన సహవాసం, కీర్తి శరీరం, సహజ గుణాలు, నింద చెందకు, మాట తూలకు అనే పాఠ్యాంశాలు ఉండనున్నాయి.
- తొమ్మిదో తరగతిలో కోపం-శాంతం, వాగ్భూషణం, సార్థకత, నాయకత్వం, అభివృద్ధి పథం, తస్మాత్ జాగ్రత్త పాఠ్యాంశాలు ఉన్నాయి.
- ఎనిమిదో తరగతిలో ఓర్పుతో విజయం, అందమైన అలవాటు, సాయానికి సిద్ధం, శిక్షణ, దుర్గుణాలు, గౌరవం పాఠాలు ఉంచారు.
- ఏడో తరగతిలో నిషిద్ధం, దృష్టికోణం, సుజనుడు, కుటుంబ విలువలు, దివ్యాంగులకు చేయూత, దృఢచిత్తం పాఠాలను తీసుకొచ్చారు.
- ఆరో తరగతిలో సాయం చేద్దాం, యోగ్యతకే అధికారం, సాటి లేని మేటి, నడత, గుణము, చిన్ననాటి పాఠాలు పొందుపరిచారు.

అనేక విషయాలపై అవగాహనకు...

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 6-10 తరగతుల విద్యార్థులకు ఈ ఏడాది లింగ సమానత్వం, రాజ్యాంగంపైనా పుస్తకాలు అందించనున్నారు. వ్యవసాయ పనుల్లో మహిళల భాగస్వామ్యం, ఇంటి పనుల్లో మహిళలకు మగవారి సాయం లాంటి వాటిని లింగ సమానత్వం పుస్తకాల్లో తీసుకురానున్నారు. బాల్య వివాహాలపై పిల్లలకు అవగాహన కల్పించేలా పాఠ్యాంశాన్ని తీసుకొస్తున్నారు.

సమాజం పట్ల అవగాహన కోసం..

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు వంటి అంశాలతో మరో పుస్తకాన్ని తీసుకొస్తున్నారు. పిల్లల్లో నైతిక విలువలు, ప్రశ్నించేతత్వం, సమాజం పట్ల అవగాహన కల్పించేలా మూడు పుస్తకాలను తీసుకొస్తున్నారు.

పోషకాల యాజమాన్యంతో మేలైన దిగుబడులు



ట్రైనింగ్ మేన్యూవల్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

- సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్
- పంటల్లో సమగ్ర పోషకాల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు

రాజానగరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో సమగ్ర పోషకాల యాజమాన్యంతో మేలైన దిగుబడులు పొందవచ్చని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ)డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ పేర్కొన్నారు. రాజానగరం మండలం కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆధ్వర్యంలో వ్యవసాయ సొసైటీల అధికారులు, ఎరువుల డీలర్లకు పంటల్లో సమగ్ర పోషకాల యాజమాన్యంపై 15 రోజులు పాటు సాగే సర్టిఫికెట్ కోర్సును సీటీఆర్ఐలో సోమవారం ప్రారంభించారు. దీనికి శేషు మాధవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎరువుల డీలర్లకు సమగ్ర పోషకాల యాజమాన్యంలోని వివిధ అంశాలైన రసాయనిక, జీవ, సేంద్రియ ఎరువులు, వివిధ పంటల్లో వేయాల్సిన ఎరువుల షెడ్యూలు, రసాయనిక ఎరువులను అధిక మోతాదులో వాడడం వల్ల కలిగే నష్టాలను కేవీకే అధికారులు వివరించడంతో పాటు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ సొసైటీల అధికారులు ఎరువుల దుకాణాలను నడిపేటప్పుడు వ్యాపారంతో పాటు సమాజసేవను దృష్టిలో ఉంచుకోవాలని రైతులకు సమతుల్యమైన రసాయన ఎరువుల ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ 15 రోజుల కోర్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ కోర్సులో సర్టిఫికెట్ పొందాలంటే 80శాతం హాజరు తప్పనిసరి అన్నారు. కోర్సు సమయంలో తరగతి గది బోధనే కాకుండా భూసార కేంద్రాలకు, ఆదర్శ రైతుల క్షేత్రాలకు, సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలకు ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త టి.అరుణ్ కుమార్, కేవీకే పశుసంవర్థక అధికారి వి.నాగేశ్వరరెడ్డి, సస్యరక్షణాధికారి రఘునందన్, పంటల అధికారి అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషను చార్టు ఇకపై 8గంటల ముందు ప్రకటన

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైల్వే రిజర్వేషను చార్టులను ప్రకటించడంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే పీఆర్ నెం.233తో సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ రెండు నుంచి నాలుగు గంటల ముందు చార్టు ప్రకటన జరిగేది. తదనుగుణంగా ప్రయాణికుల సెల్‌ఫోన్లకు మెసేజ్ వస్తోంది. ప్రయాణికులకు మరింత సౌలభ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఇకపై రైలు బయలుదేరే 8గంటల ముందుగానే చార్టు ప్రకటన జరుగుతుంది. ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ ప్రయాణ సమయాలు ఉన్న ప్రయాణాలకు ముందు రోజు రాత్రి 9గంటలకు, మధ్యాహ్నం 2గంటల ఉంచి ఉదయం 5గంటల వరకూ ప్రయాణ సమయాలు ఉన్న వారికి ఆయా సమయాలకు 8గంటల ముందు చార్టులను విడుదల చేస్తారు. అప్పుడే ప్రయాణికుల సెల్‌ఫోన్లకు మెసేజ్ కూడా వస్తుంది. ఉదాహరణకు ఈ రోజు ఉదయం 5.30గంటలకు ప్రయాణం ఉంటే నిన్న రాత్రి 9గంటలకు చార్టు విడుదలవుతుంది. ఈ రోజు మధ్యాహ్నం 3గంటలకు ప్రయాణ సమయం ఉంటే అదే రోజు ఉదయం 7గంటల సమయంలో చార్టును విడుదల చేసే అవకాశం ఉంది. కాగా ఇప్పటి వరకూ గరిష్ఠంగా 4గంటల ముందు చార్టు ప్రకటిస్తుండడంతో రిజర్వేషను దొరకని.. అంటే ముఖ్యంగా వెయిటింగ్ లిస్టు ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. వారి ప్రయాణానికి ప్రత్యామ్నాయం చూసుకోడానికి తక్కువగా సమయం ఉండడంతో ఆందోళన చెందేవారు. ఇప్పుడు చార్టింగ్ విడుదల సమయం 8గంటల ముందుకు జరపడంతో ఈ సమస్య నెమ్మదించే అవకాశం ఉంది.

గంగతో శివుడిని మెప్పించే ప్రయత్నం

- వర్షం కోసం పరమేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం
- దుర్గాడలో ఏళ్ల నాటి ఆచారం

గొల్లప్రోలు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గంగతో శివుడిని మెప్పించే ప్రయత్నంలో భాగంగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో 49సంవత్సరాలుగా తొలి ఏకాదశి మరుసటి రోజు ద్వాదశి పర్వదినాన సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్నారు. అదే రీతిన సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిషేకం జరిపారు. మహిళలు ఇళ్ల నుంచి తెచ్చిన పసుపు జలాలతో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని తీసుకొచ్చి అభిషేకించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేటి నుంచి నీటిని బిందెలతో తీసుకువచ్చి శివలింగంపై ఉన్న గంగాదేవి పూర్తిగా నిండే వరకు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా శివనామ స్మరణతో మార్మోగింది. ఈ పూజల వల్ల వర్షాలు పడి పంటలు పండి గ్రామం సుభిక్షంగా ఉంటుందని తమ నమ్మకమని పలువురు గ్రామస్తులు తెలిపారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ఆధ్వర్యంలో ఆదిత్యశర్మ, షణ్ముఖశర్మ, కారుణ్య శర్మ, కార్తీక్‌శర్మ, ఆకెళ్ల దిలీప్‌కుమార్‌శర్మ, ర్యాలి సుబ్రహ్మణ్యకుమార్ శర్మ, సూరిభట్ల శ్రీనివాస్‌శర్మ సహస్ర ఘటాభిషేకం, 11 రుద్రాలతో అభిషేకాలు, పూజలు జరిపారు.


దుర్గాడలో ఉమారామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేక దృశ్యం


శివుడిని జలాలతో అభిషేకించేందుకు బిందెలతో సిద్ధంగా భక్తులు

ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణ పోరు మరువలేనిది


జవహర్, ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ జవహర్

మండపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటం మరువలేనిదని, నేటి తరాలకు ఆయన స్ఫూర్తి అని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మంద కృష్ణ పుట్టినరోజు, ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ఏపీ అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగల ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక సూర్య కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి జవహర్‌తోపాటు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విచ్చేశారు. తొలుత ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు బైక్ ర్యాలీ జరిపారు. అనంతరం సూర్య కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేసి వర్గీకరణ ఫలాలు సాధించిన మంద కృష్ణ కృషిని జాతి మరువదన్నారు. వర్గీకరణకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌లకు రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి అని విధాలుగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జవహర్, వేగుళ్లలను ఎమ్మార్పీఎస్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా చింతలూరు నూకాంబిక

100 కిలోల కూరగాయలతో అలంకరణ



ఆలమూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాలో పేరుగాంచిన చింతలూరు నూకాంబికా అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమించారు. ఆషాఢ మాసం అమ్మవారి జన్మనక్షత్రమైన అనురాధ నక్షత్ర పర్వదినాన అమ్మవారిని భక్తులు వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. దేవస్థానం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆలయార్చకులు, భక్తులు అనేక రకాలైన కూరగాయలను అమ్మ వారికి అలంకరించారు. అనంతరం భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఆదర్శం.. డొక్కా సీతమ్మ


ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పంతం నానాజీ

ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది.. నిరంతరం అన్నార్తుల ఆకలి తీర్చిన అన్నపూర్ణాదేవి డొక్కా సీతమ్మ స్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శమని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. కాకినాడలోని ఏపీఎస్పీ హైస్కూలు ప్లస్ ప్రాంగణంలో తెలుగు ఉపాధ్యాయురాలు ముత్య వెంకటలక్ష్మి రూ.78 వేలతో ప్రముఖ శిల్పి రాజకుమార్ వడయార్‌తో తయారు చేయించిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని డీవైఈవో వెంకటేశ్వరనాయుడు, హెచ్ఎం గాయత్రిలతో కలసి ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరికపై పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టారన్నారు. ఆమె సేవలను భావి తరాలకు చాటిచెప్పాలన్న ఉద్దేశ్యంతో ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాలరావు, కార్యదర్శి జొన్నాడ నరసింహరావు, నాయకులు తాటికాయల వీరబాబు, మాదారపు తాతాజీ, రాయుడు అనిల్, తురగా సంతోష్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో మండపేటకు రెండో స్థానం

పరిపాలన పరిశుభ్రత, అభివృద్ధిలో ప్రగతి ఆధారంగా గుర్తింపు.. ఐవీఆర్ఎస్ సర్వే


మండపేట మునిసిపల్ కార్యాలయం

మండపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర స్థాయిలో 77 మున్సిపాల్టీలో ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటా చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, అభివృద్ధి పాలనాపరమైన అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజా సర్వేలో మండపేట మున్సిపాల్టీకి రాష్ట్రస్థాయిలో రెండోస్థానం దక్కిందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పురపాలకశాఖ రాష్ట్ర కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా పారిశుధ్యం, పరిశుభ్రత అంశాల్లో మండపేట పట్టణం రెండో స్థానంలో నిలిచిందన్నారు. పట్టణాన్ని అన్ని విధాల పరిశుభ్రంగా ఉంచడం, తడి, పొడి చెత్త సేకరణలో శ్రద్ధ కనబరిచిన మున్సిపల్ సిబ్బందితోపాటు మెప్మా సిబ్బందిని అభినందించారని కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిశుభ్రత విషయంలో తమకు సహకరించిన పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. శానిటరీ ఇంజనీరింగ్ పరిపాలన ఉద్యోగులను అభినందించారు.

వెంకన్న ఆలయంలో రాష్ట్ర అటవీ ఐటీ సలహాదారుడి పూజలు



ఆత్రేయపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వేంకటేశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర అటవీ శాఖ ఐటీ ముఖ్య సలహాదారుడు పెన్నమరెడ్డి నాగబాబు దంపతులు దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ జాప్యంపై
అమలాపురం ఎంపీ ఆగ్రహం


ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో భేటీ అయిన ఎంపీ

ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో భేటీ
ఈ నెలాఖరు నాటికి ఫ్లైఓవర్ పూర్తి చేస్తామని కాంట్రాక్టరు హామీ

అమలాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 16వ జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద హైవే ఫ్లైఓవర్ నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థ అనుసరిస్తున్న నిర్లక్ష్యంపై అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌మాధుర్ తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. జొన్నాడ ఫ్లైఓవర్ పురోగతిపై కేంద్ర ఉపరితల రవాణామంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడతానని ఆయన పేర్కొన్నారు. జొన్నాడ హైవే పనులపై హైవే ప్రాజెక్టు డైరెక్టర్, జొన్నాడ ఫ్లైఓవర్ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో అమలాపురంలోని ఎంపీ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని మోరంపూడి ఫ్లైఓవర్‌ను అసంపూర్తిగా వదిలేశారని, జొన్నాడ ఫ్లైఓవర్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులపై ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుని ప్రాజెక్టును త్వరితగతిన చేపట్టాల్సిందిగా డైరెక్టర్‌ను కోరారు. జూలై నెలాఖరుకు ఫ్లైఓవర్ గడ్డర్ల పని పూర్తిచేస్తామని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు ఎంపీకి హామీఇచ్చారు. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. దీనిపై ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ ఈ వారంలో కేంద్రమంత్రి నితీష్‌గడ్కరీతో సమావేశమవుతానని, వివిధ ప్రాంతాల్లో కాంట్రాక్టు సంస్థ చేపడుతున్న పనులపై చర్చిస్తానని తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారి అభివృద్ధి పనులను ఎన్‌హెచ్ డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మడికి సెంటర్, చెముడులంక జంక్షన్‌లో సర్వీసు రోడ్ల నిర్మాణం అగ్రిమెంట్ దశలో ఉందని, చొప్పెళ్ల జంక్షన్ వద్ద అభివృద్ధి పనులు పూర్తిచేసినట్టు తెలిపారు. జొన్నాడ ఆంజనేయస్వామి గుడి వద్ద సోలార్ లైట్ల నిర్మాణం టెండరు దశలో ఉందన్నారు. రావులపాలెం సెంటర్‌లో సర్వీసు రోడ్డు, హైవే లైట్లు నిర్మించామన్నారు. మల్లాయిదొడ్డి సెంటర్‌లో సోలార్ లైట్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామని, ఈతకోట, గోపాలపురం సెంటర్‌లో సోలార్ లైట్ల ఏర్పాటు పూర్తయిందని ఎంపీ తెలిపారు.

టౌన్.. క్లీన్!

ఇక పట్టణాల్లో కంపోస్టు యార్డులు కనుమరుగు

- అక్కడి చెత్తంతా పవర్ ప్లాంట్‌లకు తరలింపు
- విశాఖ లేదా గుంటూరు జిందాల్ చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌కు తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు
- చెత్త తరలించే కంపాక్టర్‌ల కొనుగోలుకు రూ.225 కోట్ల కేటాయింపు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పురపాలక సంస్థలు నగదు చెల్లింపు


మండపేటలో సంఘం కాలనీకి వెళ్లే దారిలో ఉన్న కంపోస్టు యార్డు

మండపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇక పట్టణాలు, నగరాల్లో ఎక్కడా చెత్త వేసే కంపోస్టు యార్డులు కనిపించవు. ఆయా ప్రాంతాలను చెత్తరహితంగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.225 కోట్ల వ్యయంతో రహదారులను శుభ్రం చేసే స్వీపింగ్ యంత్రాలు, చెత్తను తరలించే కంపాక్టర్‌లను కొనుగోలు చేయాలని తాజాగా ఆదేశాలను జారీ చేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సగం, పురపాలక సంస్థలు సగం వంతున నగదును చెల్లించి యంత్రాలను కొనుగోలు చేయాలని పురపాలక సంస్థలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చెత్త అక్కడికి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న పురపాలక సంస్థలు రాజమహేంద్రవరం, కాకినాడతో నగరాలతోపాటు అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, సామర్లకోట, పెద్దాపురం, తుని, పిఠాపురం, ఏలేశ్వరం, కొవ్వూరు, నిడదవోలు, మున్సిపాల్టీలలో ప్రతి రోజూ ఉత్పత్తి అయ్యే చెత్తను ఇక నుంచి ఏ రోజుకారోజు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రాలు ఉన్న గుంటూరు లేదా విశాఖకు 40 టన్నుల సామర్థ్యం కలిగిన కంపాక్టర్ ద్వారా తరలించాల్సి ఉంటుంది. ఆ మేరకు అయ్యే రవాణా చార్జీలను ఆయా మున్సిపాల్టీలు భరించాల్సి ఉంటుంది. దీంతో క్లీన్ పట్టణాలుగా ఆయా మున్సిపల్ పట్టణాలు కనిపించనున్నాయి. ఇప్పటివరకు చెత్తను నిల్వ చేసే కంపోస్టు యార్డుల్లో ఉన్న చెత్తను ఎరువుగా మార్చి వేసి అక్కడ చెత్తను పూర్తిగా ఖాళీ చేసి పార్కులుగా మార్చుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

చెత్త యార్డులు ఖాళీ చేసేందుకు టెండర్లు...

దాంతో అధికారులు మున్సిపాల్టీల్లో ప్రస్తుతం ఉన్న కంపోస్టు యార్డుల్లో చెత్తను వేరు చేసి దానిని తరలించి ఖాళీ చేసేందుకు టెండర్లు కూడా పిలిచారు. మండపేట మున్సిపాల్టీలో రూ.29 లక్షలతో కంపోస్టు కేంద్రంలో ఉన్న చెత్తను తరలించేలా టెండరు పిలిచారు. మున్సి పాల్టీల్లో ఏరోజు వచ్చే చెత్తను ఆరోజు లారీల ద్వారా సేకరించి వాటిని వాటర్‌వర్క్సుకు తరలించి అదేరోజు మున్సిపాల్టీకి దగ్గరగా ఉండే జిందాల్ విద్యుదుత్పత్తి చేసే కేంద్రం గుంటూరు లేదా విశాఖకు తరలించాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు మున్సిపల్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. పట్టణాల్లో నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త ఎంత మేర వస్తుంది, అందులో తడిచెత్త పొడిచెత్త ఎంతెంత? ప్లాస్టిక్ ఎంత అనేదానిపై కూడా ప్రభుత్వం లెక్కలు తీస్తోంది. ఈమేరకు మున్సిపల్ అధికారులు ఏమేరకు చెత్త ఉత్పత్తి అవుతుందనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు అత్యాచారయత్నం

నల్లజర్ల పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు

నల్లజర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ నాయకుడినంటూ ప్రచారం చేసుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన మర్రి శోభనబాబు అదే గ్రామానికి చెందిన మహిళపై అత్యాచార యత్నం చేశాడు. గ్రామానికి చెందిన ఓ వివాహిత తన భర్తతో మనస్పర్థల కారణంగా 4 ఏళ్ల క్రితం విడాకులు తీసుకుంది. మర్రి శోభనబాబు పలుమార్లు ఆమె ఇంటికి వచ్చి వేధించేవాడు. సోమవారం ఉదయం 7 గంటలకు వంట గదిలో ఉండగా శోభన్ బాబు వచ్చి తనపై అత్యాచారయత్నం చేశాడని, గోళ్లతో చేతులపై రక్కి పొత్తు కడుపుపై తన్నడంతో తాను పడిపోయాయని, పక్కింటి వారొచ్చి తనను ఆసుపత్రికి తీసుకెళ్లినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ రాంబాబును వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠ

రాచపల్లికి తరలివచ్చిన ఎమ్మెల్యేలు, స్వామీజీలు, బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. అరుణాచలంలోని దేసిక పరామాచార్య స్వామి చేతులమీదుగా 63 నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, అనపర్తి ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్రమాధవ్, పలు పుర పీఠాధిపతులు, స్వామిజీలు, ప్రముఖులు పాల్గొన్నారు. అరుణాచలంలోని 27వ సన్నిధానానికి చెందిన మాసిలామణి జ్ఞాన సంబంధ దేసిక పరామాచార్య స్వామి అరుణాచల ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ పి. అరుణాచల కార్తికేయ శివాచార్య స్వామిజీలు, తదితర వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నాయినార్ల విగ్రహాలకు కుంభాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తి, లక్ష్మి హాయిగ్రీవ, సూర్యభగవాన్, కాళ్ళ భైరవ, గంగామాత విగ్రహాలను కూడా ఉప ఆలయాల్లో స్వామిజీలను ప్రతిష్ఠించారు. ప్రముఖ నాయినార్ల చరిత్రకారిణి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త అరుణాచలమాధవి, అరుణాచల ఆలయ వ్యవస్థాపకులు స్వామి రమానంద పర్యవేక్షణలో ఈ విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. విగ్రహాలకు ఎమ్మెల్యేలు, బీజేపీ నేతలు మాధవ్, బిక్కిన విశ్వేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు రమానంద, వాసుదేవ నంద గిరిస్వామి, సినీ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, అన్నపూర్ణమ్మ దంపతులు, ఎన్‌ఎఫ్‌సీఎల్ మాజీ చైర్మన్ కేవీఎస్ రాజు, పెరల్ గ్రానెట్స్ ఎంపీచలవాది వెంకటనాగరాజు, శ్రీదేవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న దృశ్యం, భక్తజనంతో కిక్కిరిసిన ఆలయం


స్వామిజీల ప్రసంగాలను వింటున్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు


గొల్లప్రోలు సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా మాయమాటలు

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను ప్రజలు నిలదీయాలి
మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

గొల్లప్రోలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా మాయమాటలు చెప్పేవారిని మోసగాళ్లని కాకుండా ఏమని పిలవాలని మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని సత్యకృష్ణ ఫంక్షన్ హాలులో సోమవారం కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగిన పిఠాపురం నియోజకవర్గ వైసీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలు అమలు చేయకపోవడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను ప్రజలు నిలదీయాలన్నారు. వాటిపై అడిగితే మక్కెలు విరగకొడతాం, తాటలు తీస్తామని బాబు,పవన్ అంటున్నారని.. ప్రజల్లో తిరిగితే ఎవరి మక్కెలు విరగగొడతారో తెలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఉద్యోగం ఇవ్వలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రజలు మోసపోతారని.. చంద్రబాబు వంద చెబితే, లోకేశ్ రెండు వందల అబద్ధాలు చెబుతాడని ఎద్దేవా చేశారు. కూటమి ఇచ్చే హామీలు అమలు చేసే బాధ్యత తనదని, ఎన్నికల ముందు చెప్పిన పవన్ ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ చంద్రబాబును సీఎంగా చూడాలనుకునే పవన్‌ను హీరోగా భావించడం మన ఖర్మన్నారు. ఎమ్మెల్యే అయిన పవన్ పిఠాపురం ఎన్నిసార్లు వచ్చాడని, ఆయనకు ప్రజా సమస్యల పట్టించుకునే తీరిక ఉందా అని ప్రశ్నించారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల వైసీపీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి తోట నరసింహం, నేతలు ముద్రగడ గిరిబాబు, దవులూరి దొరబాబు, యనమల కృష్ణుడు ఉన్నారు.

బైక్‌ల దొంగ అరెస్టు

14 రోజుల రిమాండ్

అమలాపురం టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి 4 మోటారుసైకిళ్లు, రూ.10వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన గోళ్ల నాగబసవరాజు గత కొంతకాలంగా మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్నాడు. పట్టణ ఎస్ఐ టి.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి బసవరాజును పట్టుకుని మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సోమవారం తెలిపారు. నిందితుడిని కోర్టులోహాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించగా కొత్తపేట సబ్‌జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

హుండీలో నగదు చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

కరప, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురులోని వేంకటేశ్వరస్వామి గుడి హుండీని బద్దలు కొట్టి నగదు చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. ఈనెల 3న నడకుదురులోని వేంకటేశ్వరస్వామి గుడి హుండీలోని నగదు చోరీ జరిగింది. గుడి నిర్వాహకుడు గొల్లపల్లి చంద్రశేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో కాకినాడరూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన బొడ్డు అంజిబాబు అలి యాస్ తిక్క అంజి చోరీ చేసినట్టు గుర్తించారు. నడకుదురులోని ఒక ఫంక్షన్ హాల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని హుండీ డబ్బులు రూ.3,600ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కాకినాడ ఎస్‌జేఎఫ్‌సీఎం ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

హీరో ప్రభాస్ పేరున కుంకుమార్చన

'లోవ'లో శ్యామలాదేవి ప్రత్యేక పూజలు


అమ్మవారికి సారె సమర్పిస్తున్న శ్యామలాదేవి

తుని రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దివంగత సినీ నటుడు, పార్లమెంట్ సభ్యుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి కాకినాడ జిల్లా తలుపులమ్మ లోవ దేవస్థానంలో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాస పర్వదినాలను పురస్కరించుకుని అ మ్మవారికి సారె సమర్పించారు. అనంతరం సినీ హీ రో ప్రభాస్ పేరున కుంకుమార్చన నిర్వహించారు. ఆల య పండితులు వేద ఆశీర్వచనాలు ఇచ్చి అమ్మవారి మహా ప్రసాదాన్ని శ్యామ లాదేవికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ తూర్పు కనుమల్లో ఆహ్లాదకర వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, పండితులు ఆలయ వైభవాన్ని చెప్పిన తర్వాత ఏటా అమ్మవారిని దర్శించుకోవాలని కోరిక కలిగిందని ఆమె తెలిపారు.


ఆలయ ప్రాంగణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ...

ఏసీబీ కేసులో తప్పుడు సాక్ష్యం వ్యక్తికి జైలు, జరిమానా

ఉండ్రాజవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.500 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 3వ అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు చెప్పినట్టు రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగలక్ష్మి, సుంకర దైవకృప ప్రభుత్వ గృహనిర్మాణ పథకంలో 2009లో ఇళ్లు నిర్మించుకున్నారు. గృహనిర్మాణ బిల్లులు రాలేదని, బిల్లులు మంజూరు చేయడానికి అప్పటి హౌసింగ్ ఏఈ యలమంచిలి ప్రకాశరావు ఒక్కొక్కరి నుంచి రూ.3వేలు చొప్పున రూ.6వేలు అంచం అడిగారని అదే గ్రామానికి చెందిన బస్వా నాగవెంకటగణేష్ 2009 మార్చి 3న ఏలూరు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బస్వా నాగవెంకటగణేష్ రూ.6వేలు ఏఈ ప్రకాశరావుకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. అయితే కేసు విచారణలో ఫిర్యాదు నాగవెంకటగణేష్ ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట తప్పుడు సాక్ష్యం ఇచ్చాడు. దీనిపై రాజమహేంద్రవరం 3వ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పినందుకు నాగవెంకటగణేష్‌పై కేసు నమోదు చేశారు. మెజిస్ట్రేట్ కేసు విచారించి, ఏసీబీ కోర్టులో తప్పుడు సాక్షం చెప్పినట్టు నిర్ధారించి ఏడాది జైలు, రూ.5000 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

పాముకాటుకు వివాహిత మృతి

కరప, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లిలో పాము కరిచి వివాహిత మృతిచెందినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. గ్రామానికి చెందిన బోనంగి లోవ తల్లి అనే మహిళ ఈనెల 3న ఇంట్లో వంట చేస్తుండగా పాము కరిచింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి సోదరి రాచకొండ శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

అనారోగ్యంతో మస్కట్‌లో మహిళ ఇబ్బందులు

క్షేమంగా రప్పించాలని భర్త వేడుకోలు


పాలెపు దుర్గ

అమలాపురం టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన మస్కట్‌కు పదకొండు నెలల క్రితం వెళ్లింది. అక్కడ సరైన ఉపాధి చూపించకపోవడంతో తన భార్య అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఇంటికి పంపించమని వేడుకుంటుంటే రూ.2.50లక్షల సొమ్ములు కట్టాలని ఏజెంట్ చెబుతున్నాడు. అంత ఆర్థిక స్తోమత లేదు. తన భార్యను క్షేమంగా ఇంటికి తీసుకురావాలని కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పాలెపు రాజు వేడుకుంటున్నాడు. కొమరగిరిపట్నానికి చెందిన పాలెపు దుర్గ ఉపాధి నిమిత్తం మస్కట్‌కు వెళ్లింది. అక్కడకు వెళ్లిన మొదట్లో 3నెలల పాటు ఏజెంట్ కార్యాలయంలోనే ఉంది. ఆ తరువాత ఒక ఇంట్లో పనికి కుదిర్చారు. ఆ ఇంటి యజమానికి మతిస్థిమితం లేదు. పదేపదే కొరకడం, కొట్టడం చేస్తున్నాడు. దాంతో 4 నెలల పాటు చాలా ఇబ్బందులు పడి అక్కడే పనిచేసింది. ఆ తరువాత ఏజెంట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఒక మంచి పని చూపించాలని వేడుకున్నా పట్టించుకోలేదు. సరైన వసతులు, ఆహారం లేకుండా అక్కడో పదిరోజులు, ఇక్కడో పది రోజులు పనిచేస్తుండడంతో అనారోగ్యం పాలై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. భార్య దుర్గ చనిపోయేలా ఉందని ఏజెంట్‌ను వేడుకుని ఇంటికి పంపించమని అడుగుతున్నా రూ.2.50లక్షలు చెల్లించాలంటున్నారని పాలెపు రాజు వాపోయాడు. కూలి పని చేసుకునే తమ వద్ద అంత ఆర్థిక స్తోమత లేదని, తన భార్యను స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో రాజు అర్జీ అందించాడు.

డాక్టర్ శర్మకు సీఎంఏ సదస్సు ఆహ్వానం


మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణశర్మ

అమలాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): 56 సభ్య దేశాలు కలిగిన కామన్‌వెల్త్ మెడికల్ అసోసియేషన్ (సీఎంఏ) సర్వ సభ్య సమావేశానికి కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన డాక్టర్ పప్పు సత్యనారాయణశర్మకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈనెల18న లండన్‌లో జరిగే సదస్సుకు సీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జేఏ లాల్ నుంచి లేఖ అందినట్టు శర్మ సోమవారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వివరించారు. కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ స్టాప్ టీబీ ఇనీషియేటివ్ సబ్ కమిటీలో డాక్టర్ శర్మ సభ్యుడిగా కొనసాగుతున్నారు. గత 2 దశాబ్దాలుగా క్షయవ్యాధి నిర్మూలన కోసం వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఉపసంఘంలో సభ్యత్వం లభించినట్టు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు 2023 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు సభ్య దేశాల ప్రతినిధులు కృషి చేస్తున్నారని శర్మ వివరించారు. దేశవ్యాప్తంగా అంతర్జాతీయ సదస్సుకు 25 మంది హాజరవుతుండగా ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ శర్మకు మాత్రమే ప్రత్యేక గుర్తింపుతో ఈ ఆహ్వానం అందింది. డాక్టర్ శర్మ ప్రస్తుతం జాతీయ వైద్య సంఘం క్షయవ్యాధి నిర్మూలనా సంఘం కోచైర్మన్‌గా, రాష్ట్ర ఉపసంఘం కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. 2026-27 సంవత్సరానికి ఐ ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ శర్మ ఎన్నిక కావడం విశేషం. అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతున్న డాక్టర్ శర్మను పలువురు అభినందించారు.

పవన్ ఎక్కడ పోటీ చేయమంటే అక్కడే చేస్తా

ముద్రగడ కుమార్తె క్రాంతి


సత్యదేవుడి దర్శనానంతరం క్రాంతి

అన్నవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తనను ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తానని కాపు ఉద్యమనేత ముద్రగడ కుమార్తె క్రాంతి పేర్కొన్నారు. సోమవారం కుటుంబసభ్యులతో కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడిని దర్శించిన ఆమె విలేకర్లతో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తిపాడు జనసేన అభ్యర్థిగా పోటీచేసేందుకు నియోజకవర్గంలో తిరుగుతున్నారనే ప్రచారంపై ఆమె మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రి, రావులపాలెంలో పర్యటించానని.. తనకు టిక్కెట్ ఇచ్చేది లేనిది పవన్‌కల్యాణ్ నిర్ణయిస్తారని తెలిపారు. తన తండ్రి ఆరోగ్యం బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. ఆమెకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న 3 మోటారుసైకిళ్ల స్వాధీనం

కొవ్వూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న 3 మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ టీ.సునీత తెలిపారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద అధికారులు వాహన తనిఖీ చేపట్టారు. నిడదవోలు పట్టణం, గోపవరం, పురుషోత్తపల్లి, కొవ్వూరు మండలం మద్దూరు నుంచి రాజమహేంద్రవరం వైపు 510 కిలోల బియ్యంతో వెళ్తున్న 3మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారిపై 6ఏ కేసులు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



చీర మేను వేట!

చీర మేను చేపల కోసం రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద పిల్లలు, పెద్దలు చీరలు, చున్నీలతో వేటాడారు. అవి దొరకడంతో బాటిల్స్‌లో నింపి పట్టుకెళ్తున్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

అమీనబాద్‌లో రూ.50వేల నగదు చోరీ

కొత్తపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనబాద్‌లో కె.చిట్టెమ్మ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించిన రూ.50వేలు నగదు అపహరించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీరువాలో ఉంచిన నగదు చోరీకి గురైందన్న సమాచారం మేరకు కొత్తపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కాకినాడలో మోటారు సైకిళ్లపై ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

'దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయాలి'

కాకినాడ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. దీనిని భానుగుడి సెంటర్ వద్ద సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, ఏఐసీసీటీయూ రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, వివిధ కార్మిక సంఘాల నాయకులు అంకాడి పద్మావతి, భారతీప్రియ, జ్యోతి, అప్పలస్వామి, వర్మ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కుంచే చిన్నా, వీరబాబు, సత్యనారాయణ, గోపాలకృష్ణ, గోవిందు, సూర్యచక్రం తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని యానలపు సూర్యారావు భవనం వద్ద యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి.ప్రభాకర్‌వర్మ జెండా ఊపి ప్రారంభించారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నాయకులు గడిగట్ల సత్తి బాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, అంగన్వా డీలు దాడి బేబి, పద్మ, ఇందిరాప్రియదర్శిని, పెయింటింగ్ యూనియన్‌కు చెందిన వడ్డి సత్యనారాయణ, టి.శ్రీను, ఎలక్ట్రికల్ యూనియ న్ తరపున తాడిశెట్టి గంగ, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. యూనియన్ నాయకులు శివకోట అప్పారావు, వర్రీ గిరిబాబు, ఏడిద చిన్ని తదితరులు పాల్గొన్నారు.

కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పరిధిలోని పర్లోవపేట, దుమ్ములపేట, సంజీవ్‌నగర్, శాంతినగర్, బుల్లెబ్బాయిరెడ్డి కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివకోటి రాజు మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. అర్హులదరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. పార్టీ ప్రతినిధులు మంగాదేవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



'బుద్ధునితో నా ప్రయాణం-డాక్టర్ అంబేద్కర్'

బ్రోచర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బుద్ధునితో నా ప్రయాణం-డాక్టర్ అంబేద్కర్ (బౌద్ధ దమ్మ పునర్జీవన నేపథ్యం) తెలుగు నాటక ప్రదర్శన బ్రోచర్‌ను డాక్టర్ కేఆర్ఎస్ జవహర్, ఎ.రామేశ్వరరావు, డాక్టర్ భానుమతి, కమిటీ కన్వీనర్ పి.రామారావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు కాకినాడలో నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సహ కన్వీనర్ పి.రాంప్రసాద్, కోశాధికారి టి.నూకరాజు ఎస్.పెద్దిరాజు, జి.కింగ్, డి.నరసింహమూర్తి, బి.కుమార్, ఎన్.రమేష్, పి.నాగేంద్ర, టి.దుర్గబాబు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాస సోమవారం సందర్భంగా కుమారరామ భీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణల మధ్య భీమేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రసాదాలు స్వీకరించారు.

వన మహోత్సవం

పిఠాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భాష్యం స్కూలు విద్యార్థులు వైఎస్సార్ గార్డెన్స్‌లో ఇంటింటికీ వెళ్లి మొక్కలు అందజేశారు. పాఠశాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బొజ్జా కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

'బేటీ బచావో-బేటీ పడావో'పై అవగాహన సదస్సు

పిఠాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బేటీ బచావో-బేటీ పడావోపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులు, లైంగిక వేధింపులు, చెడు, మంచి స్పర్శ, ఇందుకు సంబంధించి ఉన్న రక్షణ చట్టాలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పనితీరు గురించి వివరించారు. సదస్సులో ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, బాలల పరిరక్షణ విభాగం జిల్లా కౌన్సిలర్ బి.దుర్గారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, నాగమణి, విద్యార్థినులు పాల్గొన్నారు.





కాకినాడ జగన్నాథపురం నరసింహ రోడ్‌లో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, తాళ్లరేవు మండలం సీతారామపురంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పం

కాకినాడ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి సుపరిపాలన, సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా సోమవారం ఆయన 10వ డివిజన్ పరిధిలోని దుమ్ములపేట, 25వ డివిజన్ జగన్నాథపురం నరసింహ రోడ్ ప్రాంతాల్లో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా డివి జన్ల నాయకులు ఏరిపిల్లి రాము, మేడిశెట్టి ఈశ్వ రరావు, చోడిపిల్లి సతీష్, మూగు రాజు, మోసా పేతూరు, పాలెపు నూకరాజు, మాదే ఆంధ్రయ్య, చోడిపిల్లి ప్రేమానందం, ఎరుపిల్లి అబ్బాయి, కొపనాతి నాగకుమారి, కోమటి మసేనమ్మ, తిరిది ఎల్లయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని టీడీపీ కాకినాడ రూరల్ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) అన్నారు. 47వ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో సోమవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందించారు. ఎస్సీ, గౌడ కార్పొరేషన్ల డైరెక్టర్లు కొల్లాబత్తుల అప్పారావు, మట్టా ప్రకాశ్‌గౌడ్, కొజు నెహ్రూ, ఏటుకూరి నాగమణి, కంచుమర్తి లావణ్య, కాకరపల్లి చలపతి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ 47వ డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న రూరల్ కో-కో-ఆర్డినేటర్ ప్రభాకర్

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిగలపల్లిలంకలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు పర్యటించారు. ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకువివరించారు. హరీష్ స్పోర్ట్స్ అధినేత టి.హరీష్, నాయకులు పెంకే దుర్గారావు, శ్రీనివాస్, సత్తిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెల్లావారిపేట, రత్నవారిపేట, సీతారామపురం, ప్రతాప్‌నగర్ గ్రామాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఇంటింటా తిరిగి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు, జక్కల ప్రసాద్‌బాబు, గంజా సూరిబాబు, పొన్నమండ రామలక్ష్మి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



శాకంబరీ అలంకారంలో ఉప్పాలమ్మ

కరప, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కరప గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు సమర్పించిన కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీజేపీ కాకినాడ తూర్పు మండలం అధ్యక్షుడిగా శేఖర్



కాకినాడ (కార్పొరేషన్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, నర్సాపురం ఇన్‌చార్జి ఎనిమిరెడ్డి మాలకొండయ్య ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా కాకినాడ తూర్పు మండలం అధ్యక్షుడిగా గాలిదేవర శేఖర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్, వార్డు స్థాయిల్లో పార్టీని బలోపేతం చేసి కాకినాడ ప్రథమ స్థానంలో ఉండేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కొక్కిలిగడ్డ గంగరాజు, దాట్ల సూర్యనారాయణరాజు, జ్యోతుల రాజేష్, నూకరాజు, బొక్క బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ పాండురంగ విఠల్ దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

సర్పవరం జంక్షన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వారంతా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ హైస్కూలు 1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు. ఐదు దశాబ్దాల తర్వాత సోమవారం బోట్ క్లబ్ పార్కు సమీపంలోని స్నేహితుని ఇంటి వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లోని మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కష్టసుఖాలను తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, పీడియాట్రిక్స్ హెచ్ఓడీ డాక్టర్ పాండురంగ విఠల్ దంపతులను ఘనంగా సత్కరించారు. డాక్టర్ వేణుగోపాల్, బొక్క రాజబాబు, మండపాక సత్యనారాయణ, రెడ్డిపల్లి వెంకటేశ్వరరావు, కొత్యం రాజు, సలీం దేవా తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ నరసన్న నగర్‌లో నిర్వహించిన శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఆర్డీవో మల్లిబాబు



కరపలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్



పిఠాపురంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కాకినాడ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, 'పద్మశ్రీ' మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని సోమవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. నరసన్న నగర్ పాండురంగస్వామి ఆలయం వద్ద గల కమ్యూనిటీ హాలులో ఎమ్మార్పీఎస్ ఉద్యమ దివంగత నేత కొండేపూడి శ్యాంబాబు స్ఫూర్తితో బాబూ జగజ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఆర్డీవో ఎస్.మల్లిబాబు ప్రారంభించారు. శ్యాంబాబు తనయుడు డాక్టర్ రాంజీ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటంతోనే వర్గీకరణ సాధ్యమైందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ పతాకాన్ని అవిష్కరించి అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ పిడుగ్గరాజు పర్యవేక్షించారు. వివిధ విభాగాల నిపుణులు డాక్టర్ రవికిరణ్, డాక్టర్ రమేష్‌చంద్ర, డాక్టర్ యండమూరి లావణ్య, డాక్టర్ ఎం.విశ్వనాథ్‌గంగాధర్ పలువురిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మోచి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జగన్నాథపురంలోని మోచీ వీధిలో కేక్ కట్ చేసి 50 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మోచీ కుల సంఘం జిల్లా నాయకుడు కటారి పద్మనాభం, బోనగిరి పోతురాజు, కటారి ప్రసాద్, కటారి శ్రీను, బి.సురేష్, బి.సర్వశుద్ధి, రాంబాబు, చింతల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా కరపలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్సీ సెల్ కాకినాడ రూరల్ అధ్యక్షుడు చాట్ర ఇమ్మానుయేల్ మాట్లాడారు. అలుపెరగని పోరాటాలు చేసి మాదిగ రిజర్వేషన్ సాధించిన ఘనత కృష్ణమాదిగకే దక్కుతుందన్నారు. కరప, జడ్.భావారం గ్రామాల్లో బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరులు కొండేపూడి శ్యాంబాబు, దామోదర్ సురేంద్ర మాదిగలకు జోహార్లు అర్పించారు. ఆయా గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి తాతపూడి అప్పారావు, సవరపు పెద్ద పాపారావు, రాయి చిన్న, కటకం వీర్రాజు, ఆర్.సుధీర్, ప్రసన్న, సుభాష్, రమేష్, నవీన్, నూతన, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్‌లో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించి పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. పెదపాటి బాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో టీడీపీ నాయకులు కొరుప్రోలు శ్రీను, నామా దొరబాబు, నల్లా శ్రీనివాస్, కోళ్ల బంగారుబాబు, మసకపల్లి రాజా, మట్టా గణేష్, సగరం అప్పన్న, కాకడ చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందుర్తిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కాకడ ఉదయకుమార్, నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): అమీనబాద్ సెంటర్లో నవ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ జెండాను మండల శాఖ అధ్యక్షుడు మోర్త రవి ప్రారంభించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేశారు. మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా కోశాధికారి సిద్ధాంతపు బెన్‌జాన్సన్, ముమ్మిడివరపు ప్రసాద్, ఏడిద మనీష్, ఏడిద కిరణ్, దొరబాబు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కాకినాడ జగన్నాథపురంలోని మోచీ వీధిలో విద్యార్థికి పెన్ను, పుస్తకం అందజేస్తున్న మోచీ కుల సంఘ నాయకుడు



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుక నిర్వహిస్తున్న దృశ్యం



కొత్తపల్లి మండలం అమీనబాద్ సెంటర్లో ఎమ్మార్పీఎస్ పతాక ఆవిష్కరణ దృశ్యం



స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ఆరోగ్యం, సంపద, సంతోషం లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్

పెద్దాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ రూపొందించారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర విజన్-2047 నిర్వహణకు ప్రతిపాదించిన కార్యాలయ భవనాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఆర్డీవో కె.శ్రీరమణి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తహసీల్దారు భానుకుమార్, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ నూతన కార్యవర్గమిదే

కాకినాడ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం సోమవారం రాయల్ పార్క్ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. అధ్యక్షుడిగా సెనేటర్ ఆకుమర్తి శామ్యూల్, కార్యదర్శిగా ఎం.విజయలక్ష్మి ప్రమాణం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రోటరీ పూర్వ గవర్నర్ ఎం.వీరభద్రారెడ్డి నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. అనంతరం సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కృష్ణకుమారి, వైస్ ప్రెసిడెంట్ సీతారామ్, పూర్వ ప్రెసిడెంట్, సెక్రటరీలు శ్రీకృష్ణవర్మ, సాయిసుందర్, సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ నూతన కార్యవర్గ సభ్యులు

'పాడా' పీజీఆర్ఎస్‌కు 46 అర్జీలు

పిఠాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి 48 అర్జీలను ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి స్వీకరించారు. అర్జీదారులు తాము ఇచ్చిన ఫిర్యాదులు, వినతులపై నమోదు, వాటి పురోగతిని టోల్‌ఫ్రీ నెంబరు 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు, తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జగ్గయ్యచెరువు కాలనీలో 120 ప్రాంతాల్లో కొత్తగా వీధిలైట్లు వేయాలని, అధ్వానంగా ఉన్న రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని, రోడ్ల వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరుతూ జనసేన నాయకులు బాలిపల్లి రాంబాబు, కావడ పోసయ్య, బండి రవి, గాది కోటేశ్వరరావు తదితరులు పీడీకి వినతిపత్రం అందజేశారు. అగ్రహారం విద్యుత్ ఆఫీసు వద్ద డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, బైపాస్‌రోడ్డుకు వెంబడి ఉన్న గృహాలకు వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు పీడీని కోరారు.



పీడీ చైత్రవర్షిణికి వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

లయన్స్ భీమేశ్వర క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

సామర్లకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట లయన్స్ భీమేశ్వర క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం రాత్రి లయన్స్ క్లబ్ భవనంలో జరిగింది. అధ్యక్షుడిగా డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా బడుగు సీతారామరాజు, కోశాధికారిగా ఏలేటి రమేష్, సభ్యులతో లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రమాణం చేయించారు. ఐపీడీజీ గౌరవ కమిటీ చైర్‌పర్సన్ ఈదర ఈశ్వరకుమార్, ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాసు, రెండవ జిల్లా వైస్ గవర్నర్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు ప్రసంగించారు. నూతన అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు దంపతులను లయన్స్ ప్రతినిధులతో పాటు పట్టణానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పోలీసు, దేవదాయ శాఖల అధికారులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

సామర్లకోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలను విద్యా శాఖ సహాయ సంచాలకుడు ఎండీ షరీఫ్ సోమవారం సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణతో కలిసి విద్యార్థుల అసెంబ్లీకి హాజరయ్యారు. ప్రతిరోజూ అసెంబ్లీ సమయానికి హాజరై మంచి క్రమశిక్షణతో ఉత్తమ విద్యా ప్రమాణాలు సాధించాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరూ మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. విద్యామిత్ర కిట్లలో వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై విద్యార్థుల నుంచి సమాచారం రాబట్టారు. ఈ నెల 10న పాఠశాలలో జరిగే మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌కు రావాలని షరీఫ్‌కు ఆహ్వానపత్రం అందజేశారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న విద్యా శాఖ సహాయ సంచాలకుడు షరీఫ్

శబ్ధ కాలుష్యానికి చెక్

82 మోడిఫైడ్ సైలెన్సర్లు తొలగింపు

కాకినాడ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శబ్ధ, వాయు కాలుష్యాలు అధికం కావడం ద్వారా హృద్రోగులు, చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, భయభ్రాంతులు కావడంతో పాటు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో శబ్ధ కాలుష్యానికి చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు. 60 డెసిబల్ స్థాయి దాటి శబ్ధ కాలుష్యాన్ని విడుదల చేస్తున్న బైక్‌లపై ట్రాఫిక్ సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సుమారు 200 డెసిబల్ స్థాయి దాటి శబ్ధ కాలుష్యం, వాయు కాలుష్యాన్ని విడుదల చేస్తున్న 52 బైక్‌లకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించి తొలగించారు. ట్రాఫిక్-1 పరిధిలో 30 మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించారు. అనంతరం వాహనాల యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించడమే కాకుండా భారీ జరిమానా విధించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్-1, 2 ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక

జగ్గంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన ప్రెసిడెంట్ చిత్తరపు యోహాను, కార్యవర్గ సభ్యులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్‌ను సోమవారం జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నవీన్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పేదరికం లేని సమాజమే లక్ష్యం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ఎటపాక,జూలై7(ఆంధ్ర జ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మాణమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. సోమవారం ఎటపాకలో సుపరిపాల నలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నెల్లిపాక, ఎటపాకలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం నెలిపాకలోని పీహెచ్‌సీని సందర్శించి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీపీవీడులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు మొహమ్మద్ జమాల్‌ఖాన్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, మండలాధ్యక్షుడు పుట్టి రమేష్ కిలారు వెంకటేశ్వరరావు, నలజాల శ్రీకాంత్ చౌదరి, మోసం రాజులు, పూరేటి వెంకటేశ్వరావు, కడియాల వెంకటే శ్వరరావు, వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, పాయం దేవీ, కణితి మధు తదితరులు పాల్గొన్నారు.

'వరద బాధితులకు అందుబాటులో ఉంటా'

కూనవరం, జూలై7(ఆంధ్రజ్యోతి): వరదలు వస్తే ప్రభుత్వం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే శిరీషదేవి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె కూనవరం మండలంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె పలు గ్రామాలను సందర్శించారు. కోతులగుట్టలో ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఎరువుల కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలోకి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూనవరంలో పర్యటించి శబరి గోదావరి సంగమం వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. వరదలు వస్తే బాధితులకు అండగా ఉంటానన్నా రు. టీడీపీ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు, బరపాటి ప్రకాశరావు, చెలకాని ఉమా, సోమక సత్యనారాయణ, గడేసుల ప్రేమ్‌చంద్, గడ్డిపాటి ప్రసాద్, నోముల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే శబరి-గోదావరి సంగమం వద్ద గిరిజన మహిళలు పాడిన రేల పాటలకు ఆకర్షితులయ్యారు. ఈసందర్భంగా వారి భూమి పండుగ ఖర్చులకు గాను రూ. రెండువేలు అందజేయడంతో గిరిజన మహిళలు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

అసంపూర్తి రోడ్లు పూర్తి చేయాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న గిరిజనులు

రాజవొమ్మంగి జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మధ్యలో నిలిచిపోయిన రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ఆయాగ్రామాల ప్రజలు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రాజవొమ్మంగి-బొరుగుపల్లి, అప్పలరాజుపేట-అమ్మిరేకుల, లోదొడ్డి- పాకవల్లి జడ్డంగి-వనకరాయి,ముంజవరపాడు-కింద్ర, దూసరపాము - డి.మల్లవరం, జమ్మిచావిడి-సింగంపల్లి మధ్యలో గతంలో పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా... పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు, పాలకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో రాజవొమ్మంగిలో సుమారు 100 మంది భారీ ర్యాలీ నిర్వహించి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రజలు బైఠాయించారు. సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు వచ్చే వరకు ధర్నా విరమించేది లేదంటూ వంటావార్పు చేశారు. దీంతో ఈఈ శ్రీనివాసరావు ఫోన్‌లో లోతా రామారావుతో మాట్లాడి 15వ తేదీన రాజవొమ్మంగి వచ్చి గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించి, ఆ రోజే స్పష్టమైన హామీ ఇస్తాననడంతో రాత్రి 7.30 గంటలకు ధర్నాను విరమించారు. ధర్నాలో గిరిజనులు పాల్గొన్నారు.

పశువులను కట్టడి చేయకుంటే గోశాలలకు తరలిస్తాం

వై.రామవరం, జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరుబయట పశువులను వదిలేస్తున్న సంబంధిత యజమానులు వాటిని కట్టడి చేయని పక్షంలో కాకినాడ, రాజమండ్రి ఇతర ప్రాంతాల్లో ఉన్న గోశాలలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో బాపన్నదొర హెచ్చరించారు. వై.రామవరం, చామగడ్డ, పనసలపాలెం, చవిటిదిబ్బలు, దేవరమడుగుల, తదితర పంచాయతీల్లో ప్రధాన రహదారులు, జనావాసాల్లో పశువులను వదిలేయడం వల్ల వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లుతుందని, అలాగే రోడ్డు ప్రమాదాలు తరచూ సంభవిస్తున్న కారణంగా రెవెన్యూ, పోలీసు, వెటర్నరీ అధికారుల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

అడ్డతీగల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు, అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు ఐ.రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏఐకేఎంఎస్, అఖిలపక్ష, కార్మిక, రైతు ప్రజాసంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి డివిజన్, మండల సభ్యులు ఏఐకేఎంఎస్ కార్యవర్గ సభ్యులు ఉపాధి, జాబ్‌కార్డ్ దారులు డ్వాక్రా సంఘాల సభ్యులు, తదితర సంఘ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాటలు విడ్డూరం'

మోతుగూడెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాటలు విడ్డూరంగా ఉన్నాయని టీడీపీ నేత కరకా వెంకటరమణ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మోతుగూడెంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం సొంత కార్యకర్తల జేబులు నింపిందే తప్ప, అభివృద్ధి చేయలేదన్నారు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తుందన్నారు. అలాగే ఎమ్మెల్యే శిరీషదేవి నాయకత్వంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయన్నారు.

ఎండీఎం వర్కర్లకు న్యాయం చేయండి

వై.రామవరం, జూలై7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్నభోజన నిర్వాహకుల సమస్యలపై స్పందించి వారికి న్యాయం చేయాలంటూ సీఐటీయూ మండల కార్యదర్శి కంభం శాంతిరాజు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవో తాతబ్బాయిదొరను కలిసి వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు త్వరితగతిన చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మధ్యాహ్నా భోజన పథక కార్యకర్తలు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

చింతూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2025-26 పోటీల్లో చింతూరు వీరభద్ర పవర్ జిమ్ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఆదివారం రాజమండ్రి తోటలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్ 13 విభాగంలో ఉయిక సంతోష్ బంగారు పతకం, జూనియర్ విభాగంలో గోలి వీర జశ్వంత్ బంగారు పతకం, ప్లస్ 86 ఉమెన్ కేటగిరీలో మధు చందన బంగారు పతకం, 60 కేటగిరీ పురుషుల విభాగంలో మైస రోహిత్ బంగారు పతకం, 65 కేటగిరీలో శీలం శ్రీకాంత్ సిల్వర్, 78 కేటగిరీ సీనియర్ మెన్ విభాగంలో మైస రాహుల్ బంగారు పతకం, 60 కేటగిరీలో డి. ధనరాజు సిల్వర్, 65 కేటగిరిలో గరగా రాము సిల్వర్, 71 కేటగిరిలో శీలం సాయిచంద్ సిల్వర్, 78 కేటగిరీలో గొంప రాము బ్రోంజ్, 88 కేటగిరీలో గొంప సాయి బంగారు పతకం, 94 కేటగిరిలో కె. లక్ష్మీగణేష్ బంగారు పతకం సాధించారు. కోచ్ గంగాధర్‌ని పలువురు అభినందించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు'



ప్రత్తిపాడు: టి.రాయవరంలో కరపత్రాలు పంచుతున్న దృశ్యం



రౌతులపూడి: ఎస్.పైడిపాలలో టీడీపీ నేతల ప్రచారం

ప్రత్తిపాడు, జూలై7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని టీడీపీ కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, మండలాధ్యక్షుడు అమరాది వెంకట్రావు, టి.రాయవరం సర్పంచ్ తటవర్తి సుబ్బారావు అన్నారు టి.రాయవరంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వారు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ విజయాలు, అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిరియాల శ్రీను, పోలిశెట్టి శ్రీనివాస్, మదినేస్వామి, సూరంపూడి శోభన్‌బాబు, తటవర్తి దొరబాబు, బి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సుపరిపాలన కార్యక్రమాలు

ఎస్.పైడిపాలలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

రౌతులపూడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి, ఎస్.పైడిపాల గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కూటమి శ్రేణులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అభివృద్ధి పనులను వివరించారు.

అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్నక్యాంటీన్‌లో గండేపల్లి మండలం కె.గోపాలపురానికి చెందిన టీడీపీ జగ్గంపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యు డు అవసరాల బాలసుబ్రహ్మణ్యం ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, అవసరాల సుబ్రహ్మణ్యం, బద్ది సురేష్, పీలా మహేష్, చాగంటి కృష్ణమోహన్, పాతాళ తాతాజీ, పాతాళ గన్నిరాజు, స లాది రామకృష్ణ, కరణం వీరబ్బులు, కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి బంద్‌ను విజయవంతం చేయండి

ప్రత్తిపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న 4 లేబర్ కోడ్‌లకు నిరసనగా ఈనెల9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్‌లు సోమవారం మండలంలో వేర్వేరుగా ప్రదర్శన, ర్యాలీలు నిర్వహించారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు ఆధ్వర్యంలో చింతలూరు, వెంకటనగరం, తోటపల్లి గ్రామంలో కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ప్రత్తిపాడులో సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావులు మోటార్ బైక్‌ర్యాలీ నిర్వహించారు.

పాన్, గుట్కా అమ్మితే చర్యలు: ఎస్ఐ

గండేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): గండేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని కాలేజీలు, స్కూళ్లు, ఇతర విద్యాసంస్థలకు వంద మీటర్ల రేంజ్‌లో ఉన్న పాన్‌షాపులు, ఇతర బడ్డీ, ఫ్యాన్సీ షాపుల్లో పాన్, గుట్కా వంటివి అమ్మితే చర్యలు తప్పవని ఎస్ఐ యువీ శివనాగబాబు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా గంజాయికి సంబంధించిన మెటీరియల్ ఉంటే తక్షణమే గండేపల్లి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయితో పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధ్వానంగా రహదారి



గండేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): గండేపల్లి నుంచి యల్లమిల్లి, రంగంపేట వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈరహదారిని మెరుగుపరిస్తే తమ కష్టాలు తీరుతాయని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కిర్లంపూడి: రామచంద్రపురంలో మందకృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకలు

తుని రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు తుని కొండారిపేట, ఇసుకలపేట, తారకరామ్‌నగర్‌లో నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేసి కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచారు. గొల్ల అప్పారావు సెంటర్లో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. గోదావరి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్ కుమార్ మాదిగ, జిల్లా కార్యదర్శి ఆరుగుల సత్తిబాబు, గంధం మహేష్ పాల్గొన్నారు.

కిర్లంపూడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్, నాయకులు తాతాడ సింహాచలం, తాతాడ అప్పయ్యమ్మ, కాకాడ కృష్ణమ్మ, సత్యనారాయణ, దార చిన్నయ్య, గంధం రాఘవ పాల్గొన్నారు.

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శంఖవరం దళితవాడలో నిర్వహించారు. సంఘపెద్దలు జెండాను ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిక పుట్టినరోజు కావడంతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మహిళలు, దళిత నేతలు పాల్గొన్నారు.

రౌతులపూడి,(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తెల అబ్రహం మాదిగ ఆధ్వర్యంలో అరుంధతి యువజన సంఘం భవనం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. గెడ్డం చిన్న శ్రీను, పిల్లి రవికుమార్, చామంద్ర నవీన్ కుమార్, చామంద్ర రాంబాబు, కాకడ అబ్బులు, గెడ్డం నూకరాజు, కొత్తెల పెద్ద పాల్గొన్నారు.

రాచపల్లిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న బీజేపీ జిల్లా నాయకులు

ప్రత్తిపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నూతనంగా నియమితులైన పోకల వంశీనాగేంద్ర మాధవ్ సోమవారం తొలిసారిగా జిల్లాలోని రాచపల్లి గ్రామంలో పర్యటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సింగిలిదేవ్‌సత్తిరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాధవ్ రాచపల్లి అరుణాచలేశ్వరాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన అరుణాచలమాధవి, రమానంద స్వామీజీలను బీజేపీ నేత మాధవ్ శాలవా కప్పి సన్మానించారు. బీజేపీ నాయకులు పైలా సుభాష్ చంద్రబాబు, ఊటా వీరబాబు, పైలా అయ్యన్న, నీలి సురేష్, రెడ్డి వరలక్ష్మి, కందా వీరాస్వామి, రెడ్డి లోవరాజు, గట్టి వెంకటరమణ, కించు జోగిరాజు, సాహితీవర్మ పాల్గొన్నారు.



రామేశ్వరంపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

గండేపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రామేశ్వరంపేట, యల్లమిల్లి గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చీకట్ల నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుంచే చిన్నబాబు, పెద్దిపూడి సురేష్, చేపల వినోద్ కుమార్, కాతేటి అరుణ్ కుమార్, పెదిపూడి నాగరాజు, కాతేటి లావరాజు, జి.అబ్బులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు అండ

కిర్లంపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహిళల చేతిలో శక్తి యాప్ పాశుపతాస్త్రం అని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ అన్నారు. సోమవారం తామరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల హైస్కూల్‌లో కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్.కృష్ణ, ఉపాధ్యాయులు పి.సత్యప్రసాద్, బి.నూకరాజు, బి.లక్ష్మీనారాయణ, వై.శ్రీనివాస్, బి.ఉమాశ్రీదేవి, ఎస్‌విటి సుందరి, గురుశ్రీ, బుజ్జ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

కిర్లంపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఆధ్వర్యంలో సోమవారం పదో వార్డు మెంబర్ చంటిబాబు, పలువురు వైసీపీ నుంచి భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి కాశీబాబు కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు.

'ఆదిత్య' అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫణిశ్రీధర్‌కు డాక్టరేట్

గండేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఫణిశ్రీధర్ గీతం యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ సాధించినట్టు ఆదిత్య యూనివర్శిటీ ప్రొచాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ పీవీ లక్ష్మీ నేతృత్వంలో ఫణిశ్రీధర్ సమర్పించిన థీసిస్ సిటి స్కాన్ ఇమేజ్ వర్గీకరణ కోసం డీప్ లెర్నింగ్ మోడల్ మెరుగైన పనితీరు అనే అంశంపై డాక్టరేట్ పొందారన్నారు. ఫణిశ్రీధర్‌ను యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, డిప్యూటీ ప్రొచాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

విద్యుత్ కష్టాలను పరిష్కరించిన ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేక బలరామపురం, ఎ. మల్లవరం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదని ఆవేదన చెందేవారు. ఇటీవల బలరామపురంలో పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు గ్రామ నాయకులు పైల పైడిరాజు, చంద్రమౌళి, గ్రామస్తులు విద్యుత్ కష్టాలు తెలిపారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఉన్నాతాధికారులతో మాట్లాడి 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యుత్ స్తంభాలు, వైర్లను 2 గ్రామాలకు తీసుకొచ్చి సోమవారం పనులు చేపట్టారు. రెండు రోజుల్లో 24 గంటలు విద్యుత్ అందిస్తామని విద్యుత్‌శాఖాధికారులు తెలిపారు.

కాండ్రేగులలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

జగ్గంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కాండ్రేగులలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ బస్వా చినబాబు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాండ్రేగుల మాజీ ఎంపీటీసీ రామిశెట్టి చంద్రరావు, యల్లపు దొరబాబు, ఆర్.పాపారావు, ఎల్.విష్ణు పాల్గొన్నారు.

రేపు కార్యదర్శులకు శిక్షణ

తొండంగి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో అన్ని కేడర్ల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బుధవారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రాజేశ్వరావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని, నిర్దేశించిన అధికారులంతా హాజరుకావాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

కోటనందూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని గ్రామంలో కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు. సోమవారం కోటనందూరులో యువకులకు అవసరం అవగాహన కల్పించారు. హెల్మెట్ సాధారణ సాధనం కాదని, ప్రాణ రక్షణ కవచం అని తెలిపారు.



వజ్రకూటంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయం

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

శంఖవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ సుపరిపాలన అందించడమే ధ్యేయంగా చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవారం మండలంలో వజ్రకూటంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? పాలన ఎలా ఉందని పలకరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, వెన్నా శివ, మండలాధ్యక్షుడు బద్ది రామారావు, నియోజకవర్గ యువత అధ్యక్షుడు కీర్తి వెంకట సుభాష్, ఈగల దేవుళ్ళు, పోలం చిన్నా, కర్రి శివాజీ, మహేష్, తోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



దానవాయిపేటలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుకు చర్యలు

తుని ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. సోమవారం దానవాయిపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం సాధించిన విజయాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతిని ప్రభుత్వం రూ.20 వేలకు పెంచిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల రాజేష్, చొక్కా కాశీ, చొక్కా బుల్లబ్బాయి, చొక్కా అప్పారావు, గంటా లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం శృంగవృక్షం గ్రామంలో కార్యక్రమం జరిగింది.

రామవరం-రాజుపాలెం రహదారిని అభివృద్ధి చేయండి

కిర్లంపూడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం నుంచి రామవరం వరకు ఉన్న ఆర్‌అండ్‌బి రహదారి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సూర్యచంద్ర ఆ రహదారిలో నడుస్తూ నిరసన తెలిపారు. 2022లో వైసీపీ నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినా రోడ్డు నిర్మాణం నత్తనడకగా సాగిందని, ఇరవై శాతం పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా ఈ రహదారికి మోక్షం లభిస్తుందని సంవత్సర కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్నా నేటి వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించకుంటే నిరసన, ఆందోళనలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

పోతులూరు సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

ప్రత్తిపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పోతులూరు సర్పంచ్ బొండు రాంబాబు చెక్ పవర్‌ను అధికారులు రద్దు చేశారు. పంచాయతీ నిధులు, ఖర్చుకు సంబంధించిన సరైన బిల్లులు లేని కారణంగా నిధులు దుర్వినియోగ అభియోగాలు తదితర అంశాలపై సర్పంచ్ బొండు రాంబాబు చెక్‌పవర్‌ను జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ రద్దు చేశారని సోమవారం స్థానిక డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్ తెలిపారు. ఇప్పటికే పంచాయతీ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సర్పంచ్ బొండు రాంబాబు సంజాయిషీ ఇవ్వకపోవడంతో చెక్‌పవర్‌ను 3నెలల పాటు రద్దు చేసినట్టు డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. పంచాయతీ నిధులు పక్కదోవ పట్టించి సర్పంచ్ అనేక అవకతవకలకు పాల్పడ్డారని, అదే గ్రామానికి చెందిన బర్ల చక్రం, పంచాది వీరబాబు ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. పెద్దాపురం డీఎల్‌పీవో బాలామణి విచారణ నిర్వహించి నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి పంపారు. ఈక్రమంలో సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దుచేయడమే కాకుండా పరిపాలనాసౌలభ్యం కోసం డిప్యూటీ ఎంపీడీవో కేవీవీఎస్ కాశీ విశ్వనాథ్‌కు చెక్‌పవర్ ఇచ్చినట్టు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జ్యోతుల నవీన్ పరామర్శ

జగ్గంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామానికి చెందిన సుంకర నాగేశ్వరరావు ఇటీవల మరణించడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సోమవారం నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. కుంచే రాజా, కోర్పు సాయితేజ, నీలం శ్రీను, రాయి సాయి ఉన్నారు.

వాసవీమాతకు 108 రకాల స్వీట్లతో సారె



అన్నవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో కొలువైన వాసవీఅమ్మవారికి వనితా, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 108రకాలైన పదార్థాలతో ఆర్యవైశ్య మహిళలు ఆషాడం సారెను సమర్పించారు. వీటితో పాటుగా చీర, పసుపు, కుంకుమ, గాజులును అందజేశారు. మహిళలంతా గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మ వారి ఆలయంలో అర్చకులకు అందజేశారు. అనంతరం ప్రసాదం రూపంలో వాటిని భక్తులకు పంపిణీ చేశారు.